సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



గంగాపురం బ్రహ్మోత్సవాలు
గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.
వివరాలు 8లో ▸



జోగుళాంబ.. నమోస్తుతే
జోగుళాంబ ఉత్సవాల్లో భాగంగా ప్రదోష కాలంలో ధ్వజారోహణం నిర్వహించారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /17.8

వాతావరణం
కొంత మేర మేఘాలు ఉంటాయి. తేమ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.

సంక్షేమ బడ్జెట్

ఆరు గ్యారంటీలకు పెద్దపీట

- ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు కేటాయింపులు
- వ్యవసాయ, సాగునీటి రంగాలకు ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలు
- రుణమాఫీ, రేషన్‌కార్డులపై స్పష్టత లేదని పలువురి అసంతృప్తి
- 'పాలమూరు'కు ప్రత్యేక కేటాయింపుల్లేవని విపక్షాల విమర్శలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీలో శనివారం డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్దపీట వేశారు. ఆరు గ్యారంటీలు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం కల్పించారు. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు ఆయా విభాగాల్లో ప్రయోజనం చేకూరనుంది. సాగునీటికి సంబంధించి ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో చివరిదశలో ఉన్న వివిధ ప్రాజెక్టుల ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిధుల కేటాయింపులపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రూ.2 లక్షల రుణమాఫీ, రేషన్‌కార్డులపై అస్పష్టత నెలకొనడం.. పాలమూరుకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడంపై విపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అభయ'హస్తం'..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అభయహస్తం కింద ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో అధికంగా కేటాయింపులు చేశారు. ఇది వరకు మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యంతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో ఉచిత వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. తాజాగా గృహజ్యోతి పథకం ద్వారా అర్హులకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను, అదేవిధంగా రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, యువ వికాసం హామీల అమల్లో భాగంగా విధివిధానాల రూపకల్పనకు శ్రీకారం చుట్టామని, త్వరలోనే అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ పథకాల అమలుకు 53,196 కోట్ల ప్రతిపాదనలు చేయగా.. ఉమ్మడి జిల్లా ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు..

ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, సొంత జాగా ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేసేందుకు బడ్జెట్‌లో రూ.7,740 కోట్లు ప్రతిపాదించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకు సంబంధించి 49వేల మందికి లబ్ధి చేకూరనుండగా.. పేద, మధ్య తరగతి వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కౌలు రైతులకు సైతం..

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. పెట్టుబడి సాయంలో భాగంగా రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు అందించేందుకు ప్రతిపాదనలు చేశారు. పంటల బీమా పథకం కింద ఫసల్ బీమా యోజనను అమలు చేయనున్నారు. ఈ రెండు పథకాలను కౌలు రైతులకు వర్తింపజేయనున్నట్లు ప్రకటించగా.. ఉమ్మడి జిల్లాలో సదరు రైతులకు ప్రయోజనం చేకూరనుంది. అదేవిధంగా నకిలీ విత్తనాలు అరికట్టేందుకు నూతన విత్తన విధానం తీసుకురానున్నారు. ఆయిల్‌పాం సాగుకు పెద్దపీట వేయగా.. ఉమ్మడి జిల్లాలో పంట సాగు పెరిగే అవకాశం ఉంది.

నేతన్నకు చేయూత..

రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన వస్త్రాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే స్కూలు యూనిఫాంలను చేనేత కార్మికుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. ఈ మేరకు గద్వాల, నారాయణపేటలో నేతన్నలు అధికంగా ఉండగా.. వారితోపాటు ఇతర జిల్లాల్లోని కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.

పాలమూరు, కల్వకుర్తి ఎత్తిపోతలకు నిధులు..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులలో తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తి చేసి.. ఎక్కువ ఆయకట్టుకు నీరందించే వాటికి ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్‌కు నిధులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. మొత్తంగా సాగు నీటి రంగానికి రూ.28,024 కోట్లు కేటాయించగా.. ఇందులో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.1,400 కోట్లు, కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.400 కోట్లు కేటాయించనున్నట్లు సమాచారం. కల్వకుర్తి ఎత్తిపోతల పరిధిలో వచ్చే ఏడాది నాటికి అదనంగా 80 వేల ఎకరాలకు నీరందించేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తోంది. కాగా గత ఏడాది బడ్జెట్‌లో పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండ, రాజీవ్ భీమా, జూరాల-పాకాల, కల్వకుర్తి, ఆర్డీఎస్, జూరాల ప్రాజెక్టులకు రూ.1603.89 కోట్లు కేటాయించారు.

మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్..

ప్రతి మండలానికి అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద రూ.500కోట్లు కేటాయించారు. విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు, మౌలిక వసతుల కల్పనకు రూ.500కోట్లు ప్రతిపాదించగా.. పాలమూరు యూనివర్సిటీకి ప్రాధాన్యం దక్కుతుందని ఆశిస్తున్నారు. అదేవిధంగా కార్మిక సంక్షేమంలో భాగంగా గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత స్కీం కింద రూ.5లక్షల ప్రమాద బీమా ప్రకటించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ, పరిశ్రమల విస్తరిస్తామని మంత్రి వెల్లడించారు. మహబూబ్‌నగర్‌లో ఐటీ టవర్ నిర్మాణం పర్తయిన క్రమంలో త్వరలో మరిన్ని ఐటీ కంపెనీలు వస్తాయని.. దీని ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిరుద్యోగులు, కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీ వేయనున్నట్లు ప్రకటించగా.. నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

బీసీ వర్గాల్లో అసంతృప్తి..

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి నిధులు కేటాయించగా.. ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బీసీ వర్గాల్లో మాత్రం అసంతృప్తి వ్యక్తమవుతోంది. జనాభాలో అధికంగా ఉన్న తమకు తక్కువ కేటాయింపులు చేశారని ఆయా సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

ఆరు గ్యారంటీలకు పెద్దపీట..



అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఆరు గ్యారంటీలకు పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయం. ఇది ముమ్మాటికీ పేదలను ఆదుకునే బడ్జెట్. విద్య, వ్యవసాయం, వైద్యరంగానికి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం. రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ప్రారంభమవుతుందని ప్రకటించడం శుభసూచికం. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందిస్తామని చేసిన ప్రకటనతో ఇల్లు లేని పేదలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉంది.

– కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

పారిశ్రామిక రంగానికి ఊతం..



బడ్జెట్‌లో పారిశ్రామిక రంగానికి కేటాయింపులు ఊతమిచ్చేలా ఉన్నాయి. ఈ రంగంలో నూతనంగా రాణించాలనుకున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంచి ప్రోత్సాహకాలను అందించినట్లే. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి ఉద్యోగ అవకాశాల కోసం నూతనంగా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఇలాంటి కేటాయింపులు దోహదపడుతాయి. సీఎం రేవంత్‌రెడ్డి పరిశ్రమల రంగాన్ని ముందు చూపుతో చాలా మంచి స్థాయికి తీసుకొస్తారని ఆశిస్తున్నా.

– జూలూరి రమేష్‌బాబు, వ్యాపారవేత్త, కల్వకుర్తి

భారం తగ్గుతుంది..



నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్ ఇవ్వడం సంతోషంగా ఉంది. మాలాంటి పేదలకు ఈ నిర్ణయం వరంలా ఉన్నాయి.

– స్వాతి, గృహిణి, నాగర్‌కర్నూల్

విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి..



గ్రామీణ స్థాయిలో ఉత్తమ విద్య అందేలా చూడాలి. విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలి. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.21.389 కోట్లు కేటాయించడం శుభ పరిణామం. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. కార్పొరేట్ స్థాయి విద్య అందేలా చూడాలి. ఉన్నత విద్య కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.

– కందికొండ ఆశ్రిత, పీజీ విద్యార్థిని, కాంసానిపల్లి, ఉప్పునుంతల మండలం

ఆశాజనకంగానే ఉంది..



గతంలో కంటే కొంత ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుంది. కేటాయించిన బడ్జెట్‌ను సంక్షేమం కోసం వినియోగించాలి. ముఖ్యంగా పెన్షనర్ల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాల్సి ఉంది. పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

– మహబూబ్‌బీ, పెన్షనర్, అచ్చంపేట

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు పెంచాలి..



సాగునీటి రంగానికి ప్రభుత్వం కేటాయించిన రూ.28 వేల కోట్లు ఏ మూలకు సరిపోవు. ప్రభుత్వం బడ్జెట్‌ను పెంచి సాగునీటి ప్రాజెక్ట్ పూర్తిచేసే చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తుంది. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

– వార్ల వెంకటయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

బీసీలకు అన్యాయం..



బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారు. బీసీ డిక్లరేషన్‌లో ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఇప్పుడు రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీలపై చులకనభావం ఉంది. బీసీలకు న్యాయం చేయాలి.

– పెద్దయ్య యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

న్యూస్‌రీల్

నేటి నుంచి పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాలు

- 14న కల్యాణం, 16న రథోత్సవం



బిజినేపల్లి: పాలెంలో వెలిసిన శ్రీఅలర్మేల్‌మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వేళ మొదటి రోజు నిత్యారాధన, తిరుమంజనము, 12న సంతానం లేని వారికి గరుడ పూజ ప్రసాద పంపిణీ చేయనున్నారు. 14న అలర్మేల్ మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఉదయం 11 గంటలకు ఘనంగా నిర్వహించనున్నారు. 15న జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించగా.. 16న రథసప్తమి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, వేంకటేశ్వర రాజా హరికథ కాలక్షేపం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా అదే రోజు రాత్రి 11 గంటల నుంచి రథోత్సవం(తేరు) కార్యక్రమం, 17న తెల్లవారుజాము వరకు ఆలయ పురవీధుల వెంట కార్యక్రమం కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 18న వివిధ ప్రత్యేక పూజా, సాంస్కృతిక కార్యక్రమాలతో పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ బ్రహ్మోత్సవ వేడుకల కోసం పెద్దఎత్తున తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలియజేశారు.

గ్యాస్ సిలిండర్ ఆన్‌లైన్ నమోదు పరిశీలన



పెంట్లవెల్లి: జటప్రోల్, పెంట్లవెల్లి గ్రామాలను జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మాత్తుగా తనిఖీ నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీఓ రామయ్యకు సూచనలు ఇచ్చారు. ప్రతి సిలిండర్ బుక్ వివరాలు కచ్చితంగా నెమ్మదిగా చూసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిదానంగా ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని పెంట్లవెల్లి, జటప్రోల్ పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచించారు. అంతేకాకుండా ఎలాంటి సమస్యలు ఉన్న తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మార్చి 3న పల్స్ పోలియో కేంద్రాల్లో పుట్టిన పాప నుంచి ఐదు సంవత్సరాలున్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలన్నారు. ఇటుక బట్టీలు, వలస కూలీలు, సంచారజీవనం చేసే పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. 3న పోలియో చుక్కలు మిగిలిపోయిన చిన్నారులకు 4, 5 తేదీల్లో సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఎస్ఎంఓ అజార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలియో కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.రవి కుమార్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వెంకట్ దాస్, తారాసింగ్ పాల్గొన్నారు.

ప్రమాదాలపై ప్రజలకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

- కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: రసాయన, జీవ, రేడియోలాజికల్ మరియు అణు విపత్తులు, ఆపదలు ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ అన్నారు. ఏదైనా అనుకోకుండా సంభవించే అణు విపత్కర సంఘటనలు జరిగినప్పుడు ప్రజలు ప్రాణ నష్టం జరగకుండా ఎలా వ్యవహరించాలో అధికారులు, ప్రజలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్ ఆవరణలో రసాయన, జీవ, రేడియోలాజికల్, అణు విపత్తులు, కాలుష్యం, ఆపదలు పేలుళ్లు సంభవించిన అత్యవసర పరిస్థితుల్లో ప్రాణనష్టం సంభవించకుండా వ్యవహరించాల్సిన అంశాలపై అణు విపత్తుల నిర్వహణ రెస్పాన్స్‌ఫోర్స్, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారుల బృందం సభ్యులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. దామోదర్‌సింగ్, గౌరవ్ యాదవ్ సభ్యులతో కూడిన టెస్ట్ బెటాలియన్ బృందంతో అణు కాలుష్య పదార్థాల నిర్వీర్యం చేసే అంశాలు, ప్రాణనష్టం జరిగినప్పుడు ప్రజలు ఎలా స్పందించి, రేడియేషన్ హెచ్చరికలను ఎలా గుర్తించాలో వారు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కలెక్టర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో జరుగుతున్న న్యూక్లియర్ మరియు బయోవార్‌ను ఎదుర్కొనేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఈ రోజు మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అధికారులు విష కాలుష్య వాయువులపై అవగాహనతో ఉంటూ, ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని సూచించారు. అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కె.సీతారామారావు, ఎన్‌డీఆర్ఎస్ సభ్యులు దామోదర్‌సింగ్, గౌరవ్ యాదవ్, జిల్లా అగ్నిమాపక అధికారి కృష్ణమూర్తి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

చెంచుల మెరుగైన జీవనోపాధికి కృషి

ప్రధానమంత్రి జన్‌మన్ యోజన ద్వారా జిల్లాలోని చెంచు ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అటవీ, గిరిజన, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకంలో భాగంగా చెంచులు నివసించే ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, సీసీరోడ్ల నిర్మాణం, వీధిలైట్లు, అవసరమైన చెంచుగూడెలకు అంగన్‌వాడీ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఇల్లు లేని చెంచులను గుర్తించి ఇళ్ల నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. చెంచుగూడెంలోని చెంచులకు ఆధార్‌కార్డు లేనివారిని గుర్తించి వారికి తక్షణమే ఆధార్‌కార్డు జారీ చేయాలని ఆదేశించారు. కుల ధ్రువీకరణ పత్రాలను ఇప్పించాలని, పీఎం కిసాన్, జన్‌ధన్ ఖాతాలను తెరిపించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలకు వారిని వర్తించేలా చేయాలని ఆదేశించారు. చెంచు ప్రజల మెరుగైన సదుపాయాల కల్పనకు కావాల్సిన ప్రణాళికలను ఈ నెల 15వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింగరావు, డీపీఓ కృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ జాఫర్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ల బదిలీలు, నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు అదనపు కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. జోగుళాంబ గద్వాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ముసిని వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. వనపర్తి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా మహమ్మద్ అసదుల్లా, మహబూబ్‌నగర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ)గా ఎ.నిర్మల, నాగర్‌కర్నూల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్ఆర్ సరిత, నాగర్‌కర్నూల్ ఎంజీకేఎల్ఐ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బి.అరుణరెడ్డి, మహబూబ్‌నగర్ ఆర్డీఓగా కేతావత్ రామకృష్ణ, నాగర్‌కర్నూల్ ఆర్డీఓగా కడెం సురేశ్, గద్వాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ అచ్చంపేట ఆర్డీఓగా, నాగర్‌కర్నూల్ ఎంజీకేఎల్ఐ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.రాంరెడ్డిని మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ కార్యాలయానికి, మహబూబ్‌నగర్ స్పెషల్ డిప్యూ టీ కలెక్టర్ (యూనిట్2) పనిచేస్తున్న జ్యోతిని హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



తహసీల్దార్ల బదిలీలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్ వి.సరితను నాగర్‌కర్నూల్ జిల్లాకు, రంగారెడ్డి నుంచి కె.వి జయకుమార్‌ను నాగర్‌కర్నూల్‌కు, వికారాబాద్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాస్, నైమత్ అలీలను నారాయణపేట జిల్లాకు, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సుభాష్‌నాయుడును వనపర్తి జిల్లాకు, ఎస్.నరేశ్‌కుమార్‌ను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నీరటి శ్రీనివాసులును నాగర్‌కర్నూల్‌కు, నవాబ్‌పేట తహసీల్దార్ మల్లికార్జున రావును వనపర్తి జిల్లాకు, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఎం.రాధాకృష్ణను గద్వాల జిల్లాకు, నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్‌ను నారాయణపేట జిల్లాకు, నాగర్‌కర్నూల్ ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఎం.శ్రీనివాసులును నల్లగొండ జిల్లాకు, నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎండీ సలీమొద్దీన్‌ను గద్వాల జిల్లాకు, కోడేరు తహసీల్దార్ జి.సైదులును యాదాద్రి జిల్లాకు, నారాయణపేట ఆర్డీఓ కార్యాలయ ఏఓ తిరుపతయ్యను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నారాయణపేట కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాంకోటిని నాగర్‌కర్నూల్‌కు, దామరగిద్ద తహసీల్దార్ కె.నాగజ్యోతిని సంగారెడ్డికి, ఊట్కూర్ తహసీల్దార్ కె.శివశ్రీనివాస్‌ను వికారాబాద్‌కు, వనపర్తి కలెక్టరేట్ సూపరింటెండెంట్ డి.మదన్‌మోహన్‌ను మహబూబ్‌నగర్‌కు, మహమ్మదాబాద్ తహసీల్దార్ పి.ఏసయ్యను వనపర్తికి, గట్టు తహసీల్దార్ ఎస్.ధనంజయ్‌ను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రమాద బీమాకు మత్స్యకారుల వివరాల నమోదు

కందనూలు: ప్రమాద బీమా పథకం కోసం జిల్లాలోని మత్స్యకారులు తమ వివరాల నమోదు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మప్ప శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో ఉండే మత్స్య సహకార సంఘం సభ్యులు, దిండి, శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో చేపల వేట చేసే లైసెన్సుదారులకు, చేపల వృత్తిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తుందన్నారు. ఇందుకు గాను గుర్తింపు పొందిన సభ్యులందరూ తమ వివరాలతో పాటు వారి నామిని వివరాలను, బ్యాంక్ ఖాతా వివరాలను జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా నమోదు చేసుకున్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన జాబితాను ఏప్రిల్ నెలలో ఇన్సూరెన్స్ కార్యాలయానికి పంపాల్సి ఉంటుందని చెప్పారు. మార్చి 15వ తేదీ లోపు జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో గుర్తింపు పొందిన సంఘం సభ్యుల వివరాలను సరిచూసుకోవాలన్నారు. వివరాలకు మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలియజేశారు.



మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ

తగ్గిన వేరుశనగ ధర

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగకు శనివారం ధర తగ్గింది. 89మంది రైతులు 3,660 బస్తాల్లో, 1,098 క్వింటాళ్ల వేరుశనగను తీసుకొచ్చారు. అత్యధికంగా రూ.7,006, మధ్యస్తంగా రూ.6,870, అతితక్కువగా రూ.4,020 ధర లభించింది.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

రాజోళి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజోళిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీశ్వర్ వివరాల మేరకు.. గట్టు మండలం బోయలగూడెం గ్రామానికి చెందిన తెలుగు వీరేష్ (22)కు రాజోళికి చెందిన భారతితో రెండేళ్ల కిందట వివాహమైంది. కాన్పు నిమిత్తం ఇటీవల భారతి తన కూతురుతో కలిసి పుట్టింటికి రాగా.. 15 రోజుల కిందట వీరేష్ శివదీక్ష చేపట్టాడు. ఈక్రమంలో శుక్రవారం కుటుంబంలో చిన్నపాటి గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన వీరేష్.. బోయలగూడెంలోని తన పొలంలో పురుగుమందు తాగాడు. అనంతరం తన భార్య, కూతురిని చూసేందుకు రాజోళికి వచ్చాడు. అతడు పురుగు మందు తాగిన విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు.. చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అలంపూర్‌లో మరో వ్యక్తి..

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన బండారి ప్రసాద్ (38) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు.. అంబేడ్కర్ కాలనీకి చెందిన బండారి ప్రసాద్ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడికి కర్నూల్ జిల్లా తుమ్మలూరుకు చెందిన సుగుణమ్మతో 2010లో వివాహమైంది. రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటుండటంతో మనస్థాపానికి గురైన అతడు.. శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు చిట్టిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై..

మద్దూరు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్దూరు మండలం ఖాజీపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఖాజీపూర్‌కు చెందిన మామిళ్ల హన్మంతు (45) ఎలాంటి పని చేయకపోవడంతో పాటు తాగుడుకు బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది ఈనెల 6న వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మద్దూరు ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ భీమయ్య తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

బల్మూర్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి చెప్పులదండ వేసిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన ఇద్దరు బీఆర్ఎస్ కార్యకర్తలపై బల్మూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ రేణయ్య వివరాల మేరకు.. కొండనాగులకు చెందిన ఎర్రం శ్రీను, బల్మూర్‌కు చెందిన చంద్రకంటి నాగయ్య బీఆర్ఎస్ కార్యకర్తలు. సీఎం చిత్రపటానికి చెప్పులదండ వేసిన వీడియోను వారు వైరల్ చేశారు. దీంతో సీఎం పరువుకు భంగం వాటిల్లిందని కొండనాగులకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఇమ్మడి విష్ణు ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

హన్వాడ: వేపూర్ గ్రామశివారులోని వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల వివరాల మేరకు.. వేపూర్‌కు చెందిన రైతు భీమయ్య వ్యవసాయ బావిలో శనివారం కుళ్లిన మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడు ఎర్ర టిషర్టు ధరించగా, కుడి చేతిపై జి.బుచ్చయ్య అనే ట్యాటు, ఘటనా స్థలంలో ఓ టవల్, చెప్పులు లభ్యమయ్యాయి. అతడిని హత్యచేసి బావిలో పడేశారా? లేక విద్యుత్ మోటార్ కేబుల్ చోరీకి వచ్చి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి నడుముకు కేబుల్‌వైరు చుట్టుకుని ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

లింక్ క్లిక్.. డబ్బులు కల్లాస్

జడ్చర్ల: మొబైల్ ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయడంతో బ్యాంకు ఖాతాలోని డబ్బులు మాయమైన ఘటన జడ్చర్ల పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ చంద్రమోహన్ వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా బద్వేల్‌కు చెందిన వువ్వాడి వెంకటేశ్వర్లు జడ్చర్లలోని వెంకటేశ్వర కాలనీలో నివాసముంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 28న క్రెడిట్ కార్డు వచ్చిందని తన మొబైల్ ఫోన్‌కు 8961706146 నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. దాని తర్వాత 8583828833 నంబర్ నుంచి అపరిచిత వ్యక్తి ఫోన్‌చేసి, తాను కొరియర్ బాయ్‌నని పరిచయం చేసుకున్నాడు. మీకు క్రెడిట్ కార్డు వచ్చిందని.. మీకు ఒక లింక్ పంపిస్తాను.. ఐడీ చెప్పాలని కోరాడు. అతడి మాటలను నమ్మిన వెంకటేశ్వర్లు.. తనకు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా, మీ అడ్రస్‌కు క్రెడిట్ కార్డు వస్తుందని నమ్మబలికారు. తదుపరి ఈనెల 2న తన ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి రూ.1,06,998 డ్రా అయ్యాయి. సైబర్ మోసానికి గురయ్యాయని గుర్తించిన అతడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రహ్మాండ నాయక.. లక్ష్మీ చెన్నకేశవ



కలశాలకు పూజలు చేస్తున్న భక్తులు

- ఘనంగా గంగాపురం బ్రహ్మోత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు

జడ్చర్ల టౌన్: గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా మాఘశుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న గంగాపూర్ చెన్నకేశవస్వామి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పుణ్యహవాచనం జరిపించి.. స్వామి, అమ్మవార్లకు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. పండితుల మంత్రోచ్చరణాల మధ్య స్వామి, అమ్మవార్లను నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆలయం పడమర ప్రాంతమైన కోయిల్‌కొండ, కోస్గి, కొడంగల్, తాండూరు, నారాయణపేటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి

ఉత్సవాల వివరాలు..

- 11న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, స్వామి వారికి పల్లకీ సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యహవాచనం, కంకణధారణ, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ
- 12న ధ్వజారోహణం, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, భేరిపూజ, దేవతాహ్వానం, హనుమత్ సేవలు
- 13న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం
- 14న స్వామి వారికి శేషవాహన, హంసవాహన సేవలు
- 15న పుష్పరథం (చిన్నతేరు)
- 16న రథోత్సవం (పెద్దతేరు)
- 17న శకటోత్సవం
- 18న చక్ర తీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం..

ప్రతి ఏటా మాఘమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధంచేశాం. ఈనెల 18వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. మహిళలకు ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం కావడంతో అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఉత్సవాల సందర్భంగా అధికంగా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను కోరాం. అలాగే రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యారోగ్య శాఖల సహకారం తీసుకుంటున్నాం.

–దీప్తి, కార్యనిర్వహణాధికారి, గంగాపూర్ ఆలయం

10వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం..

గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని 10వ శతాబ్దంలో నిర్మించారు. నాటి శిల్పుల కళా నైపుణ్యానికి ఆలయం నిదర్శనంగా నిలుస్తోంది. కోణార్క్ సూర్యదేవాలయం, గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఒకే విధంగా నిర్మించారని ప్రతీతి. ఆలయం చతురస్రాకారంలో నిర్మితమై ఉండటం ఇందుకు నిదర్శనంగా చెబుతారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కోనేరు ఇక్కడి ప్రత్యేకత. చతురస్రాకారంలో మెట్లు నిర్మించడం వల్ల ఎటునుంచి చూసినా కోనేరు ఒకేలా కనిపిస్తుంది.

జోగుళాంబ.. నమోస్తుతే



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబదేవి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 2005 నుంచి ప్రతి ఏటా మాఘశుద్ధ పాడ్యమి మొదలుకుని మాఘశుద్ధ పంచమి వరకు అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆలయ ఈఓ పురందర్ కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్యలు అమ్మవారి బ్రహ్మోత్సవాలను లాంచనంగా ప్రారంభించారు. ఉదయం అమ్మవారి ఆలయం నుంచి బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని ఆనతి స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. అక్కడ ఉత్సవ బలిభేరి పల్లకీలో కొలువుదీరగా.. గో సైతంగా ఆలయం చుట్టూ ముమ్మారు సార్లు ప్రదక్షిణలు నిర్వహించి, అమ్మవారి ఆలయంలోని యాగశాల ప్రవేశం చేశారు. అక్కడ గణపతి పూజలు, మహా సంకల్పం, పుణ్యహవాచనం, రుత్విక్ వరణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన చేశారు. అదేవిధంగా అమ్మవారి కుంకుమార్చన మండపంలో సహస్ర ఘట్టాలను ఏర్పాటు చేసి, సర్వతోభద్రమండలి వద్ద ముక్కోటి దేవతలను ఆవాహనం చేశారు. త్రికాల సమయాలలో దిక్పాలక బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రదోష కాలంలో మృత్ సంగ్రహణం వంటి కార్యక్రమాలు చేపట్టారు.



ధ్వజారోహణ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ప్రదోషకాలంలో ధ్వజారోహణ..

బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ప్రదోష కాలంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే విజయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కాగా.. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈఓకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో నిర్వహించే సేవలకు సంబంధించి డిజిటల్ చెల్లింపుల కోసం క్యూఆర్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. స్థానిక యూబీఐ మేనేజర్, ఆలయ ఈఓ, చైర్మన్ చేతుల మీదుగా క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఆలయానికి వచ్చే భక్తులు ఇకపై నగదు చెల్లింపులతో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా కూడా కానుకలను సమర్పించే అవకాశం కల్పించారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు.

పీవీకి భారతరత్న.. తెలంగాణ జాతికి గర్వకారణం



మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పౌర పురస్కారం లభించడం తెలంగాణ జాతికి గర్వకారణమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పీవీ నర్సింహారావు హయాంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి తీవ్ర సంక్షోభంలో ఉండగా.. అంతర్జాతీయ మార్కెట్ ఆధారిత విధానం, జాతీయ టెలికాం పాలసీ, సమాచార టెక్నాలజీ పాలసీ తీసుకొచ్చారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రిగా దేశానికి సేవలు అందించిన పీవీ నర్సింహారావుకు భారతరత్న అవార్డును ప్రదానం చేయడం హర్షణీయమని.. తెలంగాణ ప్రజల తరఫున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కాగా, కాంగ్రెస్‌కు కొన్నేళ్ల పాటు సేవలు అందించిన పీవీని ఆ పార్టీ అవమానాలకు గురిచేసింది తప్ప ప్రసంశలకు తావివ్వలేదని విమర్శించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పద్మజారెడ్డి, బాలరాజు, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, పాండురంగారెడ్డి, బుచ్చిరెడ్డి, అంజయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

పాలమూరుకు రెండు పతకాలు

పాలమూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లాకు రెండు పతకాలు లభించాయి. అండర్–14 బాలుర 400 మీటర్ల పరుగు పందెంలో అంకుర్ జీవన్ 56 సెకన్లలో పూర్తిచేసి, వెండి పతకం సాధించాడు. అండర్–10 బాలికల విభాగంలో వ్రింధ్యయాదవ్ వంద మీటర్ల పరుగు పోటీలో 16 సెకన్లలో పూర్తిచేసి, కాంస్య పతకం సాధించింది. పతకాలు సాధించిన క్రీడాకారులను అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర, కోచ్‌లు ఆనంద్, సునీల్, సాధిక్ అలీ, శ్రీనివాసులు అభినందించారు.



కాంస్య పతకంతో వ్రింధ్యయాదవ్

ముగిసిన అంజన్న బ్రహ్మోత్సవాలు

ఊర్కొండ: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. చివరిరోజు స్వామి వారికి చక్రతీర్థ స్నానం, అభిషేకం, అష్టోత్తర నామాలు, మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని దేవాలయం నుంచి ఊర్కొండపేటలోని అర్చకుడు చిరివేల్లి కృష్ణమూర్తిశర్మ ఇంటికి మంగళ వాయిద్యాల మధ్య చేర్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఊర్కొండ పోలీసుల ఆధ్వర్యంలో పలు అంశాలపై భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్కానిస్టేబుల్ వెంకోజీ సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్‌నాయక్, గోపాల్, అంజయ్యగౌడ్, అశోక్, మల్లేష్, చంద్రయ్య, సంగప్పగౌడ్, అర్చకులు దత్తాత్రేయశర్మ, శ్రీనుశర్మ, ప్రవీణ్, మహేశ్, రఘు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవమూర్తికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ప్రజాకాంక్షకు అనుగుణంగా పాలన

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

చిన్నచింతకుంట: రాష్ట్రంలో ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి శనివారం రాత్రి చిన్నచింతకుంటలో పాలమూరు న్యాయయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కుటుంబ పాలన కొనసాగిందన్నారు. గత ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలను విస్మరించిందని.. నిరుద్యోగులను గాలికొదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలుచేస్తామని తెలిపారు. అధికారులు ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జీఓ 46 అమలుకు కృషిచేస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందేలా చూస్తామన్నారు. చిన్నచింతకుంటలో జూనియర్ కళాశాల, దేవరకద్రలో డిగ్రీ కళాశాల, వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు కురుమూర్తి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అరవింద్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, మహమూద్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పోర్టిఫైడ్ రైస్‌పై గందరగోళం

- ప్లాస్టిక్ బియ్యం అంటూ గ్రామస్తుల ఆందోళన

నవాబుపేట: నవాబుపేట మండలం లోకిరేవు గ్రామంలో పోర్టిఫైడ్ రైస్‌పై గందరగోళం నెలకొంది. శనివారం రేషన్ డీలర్ పీడీఎస్ బియ్యం పంపిణీ చేయగా.. కొందరు లబ్ధిదారులు వాటిని కడిగేందుకు నీటిలో వేయగా, బియ్యం గింజలు తేలాయి. దీంతో అవి ప్లాస్టిక్ బియ్యం అంటూ రేషన్ దుకాణం వద్ద ఆందోళనకు దిగారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యంలో పోషకాలతో కూడిన పోర్టిఫైడ్ రైస్‌ను క్వింటాకు కిలో చొప్పున కలుపుతారని రేషన్ డీలర్ తెలియజేసినా వినిపించుకోలేదు. దీంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం ఇచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నాగరాజు లోకిరేవుకు చేరుకుని బియ్యాన్ని పరిశీలించారు. రేషన్ బియ్యంలో కలిపే పోర్టిఫైడ్ రైస్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కాగా పోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కల్పించేలా అన్ని రేషన్ దుకాణాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని డీలర్లకు సూచించారు.



లోకిరేవులో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

అట్టహాసంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ

బాలానగర్: బాలానగర్ మండల కేంద్రంలో శనివారం రాష్ట్రస్థాయి ఓపెన్ వాలీబాల్ (ఉమెన్) టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న టోర్నీలో మొత్తం 9జట్లు పాల్గొనగా.. మొదటి రోజు నిర్వహించిన పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ – రంగారెడ్డి జిల్లా స్థాయిలో పురుషులకు వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన జట్లకు మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్, బి.రఘు, జుబేర్, శ్రీశైలం, సుబ్బు పాల్గొన్నారు.



టోర్నీలో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

పాఠశాలలో ఉపాధ్యాయుడి హఠాన్మరణం

మహమ్మదాబాద్: విధి నిర్వహణలో ఉన్న ఓ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌కు చెందిన సందోళ్ల ఆంజనేయులు(50) నంచర్లలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, ఇటీవల డిప్యూటేషన్‌పై షేక్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లాడు. రోజు మాదిరిగానే శనివారం పాఠశాలకు వెళ్లిన అతడికి మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. అప్రమత్తమైన తోటి ఉపాధ్యాయులు అతడిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. తీరా అక్కడికి వెళ్లాక అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన మృతి తీరనిలోటని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న ఉపాధ్యాయుడు ఆంజనేయులు మృతిచెందడం బాధాకరమని గండేడ్, మహమ్మదాబాద్ మండలాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బోయిని గోపాల్, జెట్టి నర్సింహులు, పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



ఆంజనేయులు (ఫైల్)

వేరుశనగ కుప్పకు నిప్పు

లింగాల: వ్యవసాయ పొలంలో కుప్పగా పోసిన వేరుశనగకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఈ ఘటన లింగాల మండలం కోమటికుంటలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కోమటికుంటకు చెందిన రైతు గడ్డం కాశన్న తన పొలంలో వేరుశనగ పంట నూర్పిడి చేయించి, కాయలను కుప్పగా పోశాడు. రాత్రి వేరుశనగ కాయలపై కవర్ కప్పి ఇంటికి వెళ్లగా.. గుర్తుతెలియని దుండగులు వేరుశనగ కాయల పక్కనున్న పొట్టుకు నిప్పంటించడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు 30 క్వింటాళ్ల వేరుశనగ కాలిపోవడంతో రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్దేశ పూర్వకంగానే ఈ ఘటనకు పాల్పడ్డారని వాపోయారు.



కోమటికుంటలో దగ్ధమైన వేరుశనగ

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

బిజినేపల్లి: వట్టెం జవహార్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం ఆరు సెంటర్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 1,704 మంది విద్యార్థులకు గాను, 1,240 మంది విద్యార్థులు హాజరయ్యారు. 11వ తరగతిలో ప్రవేశ పరీక్షకు 7 సెంటర్లలో పరీక్ష నిర్వహించగా.. 2,041 మంది విద్యార్థులకు గాను 1,663 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. ఈ పరీక్షలను వైస్ ప్రిన్సిపాల్ జానకిరాములు, పరీక్ష ఇన్‌చార్జ్ భాస్కరాచారి, జిల్లా విద్యాధికారులు, రెవెన్యూ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రత్యేకంగా పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

■ మహబూబ్‌నగర్ కొత్త బస్టాండ్ ప్రక్కన పీర్లబావి దగ్గర గల ఇల్లు 432 చ॥గజాలు విస్తీర్ణంలో 10 గదులు కలిగిన మరియు కార్ పార్కింగ్ సౌకర్యంతో పడమర దిశ ముఖము కలిగినటువంటిది అమ్మకమునకు కలదు. (రెండు పోర్షన్లు) సంప్ర॥ ✆ 8465987167.

■ మహబూబ్‌నగర్, అప్పన్నపల్లి ఫోర్డ్ షోరూం వెనకాల మెయిన్ రోడ్డుకు అతి దగ్గర్లో సొంత బోర్లు కలిగిన 30 ఫీట్ రోడ్డు గల ఈస్ట్ ఫేస్ 100 గజాలు, వెస్ట్ ఫేస్ 165 గజాలు గల కొత్త ఇండ్లు తక్కువ ధరలో అమ్మకానికి కలవు. సంప్ర॥ 8074183191, 95428 99989.

PLOT FOR SALE

■ షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో బెంగళూర్ హైవే NH.44 DTCP Norms ఓపెన్ ప్లాట్లు అతి తక్కువ ధరలో అమ్మబడును నో బ్రోకర్స్. ఫోన్: 9948953694/9866608313

■ Plots Bearing No.s 7 and 8 Total Admeasuring 300.00 Sq. Yards; Having Two Roads Of 30' Feets Wide, Towards South and West, Part and Parcel of Survey No. 275 of Jadcherla Village, Gram Panchayat and Mandal, Mahbubnagar District, Telangana. Expected Amount Rs. 20,00,000/- Price Negotiable. Interested Persons May Contact No: 9866341185 and 9849451788.

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed (TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM, 3 నెలల్లో కోర్స్ పూర్తి చేసే అవకాశం. ఫోన్: 8886977112,339.

■ మీరు లాయర్, ఇంజనీర్, ప్రొఫెసర్ కావాలనుకుంటున్నారా? LL.B, B.Tech, M.Tech, M.Sc అగ్రి MBA, Ph.D (all) Cont: 7013038197, (కొన్ని సీట్లు మాత్రమే)

SERVICES

GENERAL & LAPROSCOPIC SURGEON

■ కార్తీక్ హాస్పిటల్, సుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి, షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥ పార్వతీదేవి, M.D.DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్:10-8PM, 08518-226162

సాక్షి భవిత విద్యార్థుల కోసం

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

■ డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శ్రీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98666

WANTED

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ.18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244

■ ఈ నెల 3వ వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగినవారు మాత్రమే సంప్రదించగలరు ✆ 92904 15199

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.

■ ఇంట్లో ఉండి ఇంటి పని, వంట పని చేయుటకు 50 సంవత్సరాలలోపు స్త్రీ కావలెను. గద్వాల. వివరాలకు సంప్రదించండి: 93980 26202.

■ డైరెక్ట్ జాబ్ 18-30 సం॥ మహిళలు / పురుషులు మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఫ్రీ రూం+భోజనం+డ్రైవర్లు+మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. జీతం 20,000/-. ఫోన్: 8886733005.

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ అవులను చూసుకొనుటకు కావలెను. ఫోన్: 9391008331, 9246585901.

■ బాలాజీ గ్రూప్ (A.P, T.S & న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5000/కమీషన్. 9133271122 / 9052671122.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, [illegible] ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. [illegible] గమనించగలరు - సాక్షి మేనేజర్